క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో కార్తీక శుద్ధ ఏకాదశి పూజలు



రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

మద్దిలపాలెం : కార్తీక శుద్ధ ఏకాదశి పూజలను గురువారం భక్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో ఆచరించారు. సాయంత్రం శివాలయం, వేంకటేశ్వరస్వామి దేవాలయాలను దర్శించుకున్నారు. ఆయా ఆలయాలలో దీపాలు వెలిగించారు.

ఆంగ్ల భాషపై పట్టు సాధించాలి



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం : ఆంగ్ల భాషా బోధనలో మెలకువలపై వారం రోజులుగా డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు మాట్లాడుతూ ఆంగ్ల భాషపై పట్టు సాధించడం, వృత్తి స్థలం నుంచి ప్రపంచ వేదిక వరకూ అనే అంశంపై విజయవంతంగా ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. అధ్యాపకులు బోధన రంగంలో ప్రస్తుత పరిణామాలను, పోకడలను పాటించాలని సూచించారు.

శాస్త్రోక్తంగా సత్యనారాయణ స్వామి వ్రతం



వ్రతం చేస్తున్న భక్తులు

ఎంవీపీ కాలనీ: స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీసత్యనారాయణస్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్తీక శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక భక్తులు సతీసమేతంగా వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి దర్శనం, దీపారాధన కార్యక్రమాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

భారీ వాహనాల రాకపోకల సమయాన్ని కుదించాలి



గాయపడిన చిన్నారిని పరామర్శిస్తున్న కులిడి సురేష్‌బాబు

బీచ్‌రోడ్డు: నగరంలోకి భారీ వాహనాల రాకపోకలను ఉదయం 8 నుంచి 6 గంటలకు కుదించాలని డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కులిడి సురేష్‌బాబు పోలీసులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం జరిగిన ఆటో ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన చిన్నారులను గురువారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రమాదంపై ప్రభుత్వం స్పందన అద్భుతమన్నారు. బాధితులకు కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స అందించి, ఖర్చు ప్రభుత్వమే భరించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఆయన వెంట శ్రీకాకుళం జిల్లా సీనియర్ నాయకుడు ప్రధాన రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

ఆహ్లాదం.. ఆరోగ్యం

సిటీ లైఫ్ అంటేనే బిజీ బిజీ.. ఆ గజిబిజి గందరగోళం నుంచి బయటపడి, సాయంత్రం వేళ ప్రకృతి ఒడిలో, ప్రశాంత వాతావరణంలో సేద తీరాలనుకునే వారిని నందనవనాన్ని తలపిస్తున్న పార్కులు స్వాగతిస్తున్నాయి. పాఠశాలల్లో పుస్తకాలతో కుస్తీ పట్టి వచ్చిన చిన్నారులను ఆహ్వానిస్తూ ఎన్నో ఆట పరికరాలు ఏర్పాటయ్యాయి. ఆహ్లాదకర వాతావరణంలో నడిచివద్దాం అనుకునే వారి కోసం వాకింగ్ ట్రాక్‌లు సిద్ధమయ్యాయి. యువతకు ఆరోగ్యాన్ని పెంపొందించే ఓపెన్ జిమ్‌లు కూడా పార్కులోనే నెలకొల్పారు. ఇలా.. అందం.. ఆహ్లాదం.. ఆరోగ్యం ఒకేచోట, అదీ ఇంటికి సమీపంలోనే సిద్ధమై, ఆహ్వానం పలుకుతున్నాయి.

నిధుల కేటాయింపు ఇలా

ఎంవీపీ సెక్టార్-11 పార్కు	రూ.1.12 కోట్లు
శివాజీ పార్కు	రూ.2 కోట్లు
లాసన్స్‌బే కాలనీ పార్కు	రూ.36 లక్షలు



- చూడముచ్చటగా పార్కులు
- పిల్లలు ఆడుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు
- ఓపెన్ జిమ్‌లతో పార్కులకు క్యూ
- వాకింగ్ ట్రాక్‌లతో అందరికీ ఉపయోగం



అధునాతన ఓపెన్ వ్యాయామశాల





ఎంవీపీ సెక్టార్-11 పార్కు ముఖద్వారం(ఇన్‌సెట్) నాడు పిచ్చిమొక్కలతో కళావిహీనంగా పార్కు

ఎంవీపీ కాలనీ: తూర్పు నియోజకవర్గంలో పలు పార్కులను జీవీఎంసీ స్మార్ట్‌గా తీర్చిదిద్దింది. దశాబ్దాలుగా ఆధునికీకరణకు నోచుకోని పలు పార్కులకు కొత్త సొబగులు తీసుకొచ్చింది. ఇందులో భాగంగా ఎంవీపీ కాలనీలోని సెక్టార్-11లోని పార్కును స్మార్ట్‌సిటీ పనుల్లో భాగంగా థీమ్ పార్కుగా అభివృద్ధి చేశారు. కొద్ది రోజుల్లో ఈ పార్కు కాలనీ వాసులకు అందుబాటులోకి రానుంది. కాలనీ వాసులకు పూర్తి ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని అందించేలా రూ.1.12 కోట్లుతో ఈ పార్కుకు తీర్చిదిద్దారు. నగరంలోనే రెండో అతిపెద్దదైన శివాజీ పార్కును సైతం రూ.2 కోట్లతో ఆధునికీకరించారు. లాసన్స్‌బే కాలనీ పార్కులో రూ.36 లక్షలతో స్థానికుల ఆకాంక్షలకు అనుగుణంగా పలు సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. నియోజకవర్గంలోని దాదాపు అన్ని పార్కుల్లోను ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశారు.

ఆకర్షణీయంగా థీమ్ పార్కు

పిల్లల నుంచి పెద్దలు, వృద్ధుల వరకు అందరికీ ఆహ్లాదాన్ని పంచేలా ఎంవీపీ కాలనీ సెక్టార్-11లోని థీమ్ పార్కు సిద్ధమైంది. ఓపెన్ జిమ్, షటిల్ కోర్టు, ముగ్గ్రం ట్రాక్, ప్లస్ ఆకారంలో ఇంటర్ లాకింగ్ టైల్స్, సందర్శకులు కోసం అధునాతన ట్రీబెంచ్ ఏర్పాటు చేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు వృద్ధుల కోసం ఏర్పాటు చేసిన వెయిటింగ్ హాల్ ఆధునికీకరణ, చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన మోడ్రన్ చిల్డ్రన్ ప్లే ఏరియాతో పాటు డెకరేటివ్ లైటింగ్ పోల్స్, గ్రిల్‌తో కూడిన కాంపౌండ్ వాల్ వంటి సౌకర్యాలతో పార్కును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

శివాజీ పార్కుకు మహర్దశ

దశాబ్దాలుగా పూర్తిస్థాయి ఆధునికీకరణకు నోచుకోని శివాజీ పార్కుకు మహర్దశ పట్టింది. జీవీఎంసీ ఆధ్వర్యంలో రూ.1.5 కోట్లతో పార్కులో అభివృద్ధి, ఆధునికీకరణ పనులు చేపట్టారు. పార్కు ముఖద్వారానికి నూతన శోభ తీసుకొచ్చారు.



ఆధునికీకరించిన శివాజీ పార్కు ముఖ ద్వారం



ఆహ్లాదకరంగా ఫౌంటేన్ సముదాయం

ఫ్లోరింగ్, సెంటర్ ప్లాజా ఫొటో షూట్ పాయింట్ ఆధునికీకరణ, టైల్స్ నిర్మాణం, పెయింటింగ్స్, లైటింగ్ ఏర్పాటు చేయనున్నారు. దీంతో పాటు మెయిన్ టాయిలెట్స్, క్యాంటీన్ టాయిలెట్స్ రిపేర్, ప్లంబింగ్, పాయింటింగ్ పనులు చేపట్టారు. వాకింగ్ ట్రాక్ గుంతలు లేకుండా మరమ్మతులు చేశారు. జిమ్, చిల్డ్రన్ ప్లే ఏరియాను బాగు చేశారు. మరో రూ.50 లక్షలతో ఫౌంటేన్‌ను ఆధునికరణ పనులు చేపట్టి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. ఈ ఫౌంటేన్ సముదాయం మధ్య ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి కొత్తదనాన్ని తీసుకొచ్చారు.

లాసన్స్‌బే పార్కులో సకల సౌకర్యాలు

ఈ ఏడాది ప్రారంభంలో లాసన్స్ బే పార్కులో వ్యర్థ టైర్లతో పలు చిన్నారుల ప్లే ఏరియాను జీవీఎంసీ అభివృద్ధి చేసింది. దీంతో పాటు ఇటీవల రూ.36 లక్షలతో పలు నూతన సౌకర్యాలను సైతం అందుబాటులోకి తెచ్చారు. స్థానిక ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వీటిని తీర్చిదిద్దారు. వాకర్స్ యోగా చేసుకోవడానికి అనుగుణంగా ప్రత్యేక మండపాన్ని, సేదతీరడానికి ప్రత్యేక షెడ్డును నిర్మించారు. వాహనాలు పార్కులోకి వెళ్లకుండా కొత్త గేట్ ఏర్పాటు చేశారు.



ఆధునికీకరణ బాగుంది



శివాజీపార్కులో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేపట్టారు. జీవీఎంసీ కమిషనర్‌తో పాటు మేయర్ అనేక సార్లు పార్కును సందర్శించారు. పార్కు అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని కమిషనర్ పర్యవేక్షించడం అభినందనీయం. వాకింగ్ ట్రాక్‌ను ఆధునికీకరించడంతో పాటు పలు కొత్త సౌకర్యాలు కల్పించారు. అదే విధంగా పార్కు నిర్వహణపై కూడా శ్రద్ధ వహించాలని కోరుతున్నాం.

– డాక్టర్ నందూరి రామకృష్ణ, రచయిత, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధి

దశాబ్దాల తరువాత పూర్వ వైభవం



శివాజీ పార్కుకు నగరంలో ప్రత్యేక స్థానం ఉంది. వీఎంఆర్‌డీఏ పార్కు తరువాత నగరంలో రెండో అతిపెద్ద పార్కు ఇదే. దశాబ్దాల తరువాత పార్కును పూర్తిస్థాయిలో ఆధునికీకరించి పూర్వ వైభవం తీసుకొచ్చారు. పార్కులో ఫౌంటేన్ సముదాయాన్ని పూర్తిస్థాయిలో పునరుద్ధరించడం, శివాజీ మహరాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం బాగుంది.

– సీహెచ్.శశికాంత్, శివాజీపాలెం

ఏయూ సమాచారమ్

కొనసాగుతున్న నాక్ విజయోత్సవాలు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరీక్షల విభాగంలో నాక్ విజయోత్సవం గురువారం నిర్వహించారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ ముఖ్యఅతిథిగా హాజరై కేక కట్ చేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఉద్యోగుల సమష్టి కృషితో అత్యుత్తమ స్థానాన్ని చేరుకోవడం సాధ్యపడిందన్నారు. పరీక్షల విధానం, మూల్యాంకనం, ఫలితాల విడుదల వంటి విభిన్న అంశాలను నాక్ నిపుణులు ప్రత్యక్షంగా పరిశీలించారన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, పరీక్షల విభాగం డీన్ ఆచార్య డి.వి.ఆర్.మూర్తి, ఆచార్య కె.రమాసుధ, ఆచార్య ఎస్.కె.వలి, ఐపీఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ హెచ్.పురుషోత్తం, పి.రమేష్, పరీక్షల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

ఏయూ ప్రగతిపై పాఠశాల చిన్నారుల హర్షం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం నాక్ గ్రేడింగ్‌లో అత్యుత్తమ స్థానం సాధించడంపై ఓ పాఠశాల విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. వార్తాపత్రికల్లో ఏయూ విజయాన్ని తెలుసుకున్న విద్యార్థులు ప్రత్యేకంగా ఒక పోస్టర్‌ను తయారు చేసి వీసీ ప్రసాదరెడ్డికి బహూకరించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ఎదగాలని చిన్నారులకు సూచించారు.



వీసీ ప్రసాదరెడ్డికి జ్ఞాపిక బహూకరిస్తున్న చిన్నారులు

'నాడు–నేడు' స్ఫూర్తితో హాస్టళ్లకు కొత్త రూపు

ఏయూ క్యాంపస్: ఆధునికీకరించిన ఆంధ్ర విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల విద్యార్థినుల వసతి గృహం విద్యా ప్రగతి భవన్‌ను గురువారం వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి విద్యార్థులతో కలిసి ప్రారంభించారు. హాస్టల్‌లో గదులు, టాయిలెట్స్, కిచెన్ వంటివి పూర్తిగా ఆధునికీకరించారు. విద్యార్థుల సౌకర్యార్థం గదుల్లో నూతనంగా బెడ్‌లను కూడా ఏర్పాటు చేశారు. కొత్తగా పెయింటింగ్, ఎలక్ట్రికల్ పనులు పూర్తి చేశారు. హాస్టల్‌ను సుందరంగా తీర్చిదిద్దడంపై విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన నాడు-నేడు పథకం స్ఫూర్తిగా తీసుకుని ఏయూలో హాస్టళ్లను ఆధునికీకరిస్తున్నామన్నారు. విద్యార్థినుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో వారి అవసరాలకు అనుగుణంగా హాస్టళ్ల నిర్మాణం, ఆధునికీకరణ చేపడుతున్నామన్నారు. క్యాంపస్‌కు చేరువలో అధిక శాతం మందికి వసతి కల్పన చేసే దిశగా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, ప్రిన్సిపాళ్లు ఆచార్య కె.శ్రీనివాసరావు, ఆచార్య టి.శోభశ్రీ, చీఫ్ వార్డెన్ ఆచార్య టి.వినుత, ఆచార్య ఎ.కె.ఎం.పవార్, ఆచార్య కె.రాజేంద్రప్రసాద్, ఆచార్య బి.మునిస్వామి, తదితరులు పాల్గొన్నారు.



హాస్టల్ గదులను విద్యార్థులతో ప్రారంభింపచేస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

రక్తదానంతో ప్రాణదానం



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులు రక్తదాతలుగా నిలవాలని ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఏయూ స్టాటస్టిక్స్, గణిత, అనువర్తిత గణిత శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రక్తదానం చేసిన విద్యార్థులను అభినందించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఒక్కరు చేసిన రక్తదానంతో మరో ముగ్గురి ప్రాణాలు కాపాడడం సాధ్యపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు ఆచార్య బి.మునిస్వామి, ఆచార్య కె.రాజేంద్రప్రసాద్, జి.నానాజీ రావు, ఆచార్య పి.డి.ఎస్.శ్రీనివాస్ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆపద్బాంధవుడు సీఎం వైఎస్ జగన్

- బోట్లు ప్రమాద బాధితులకు సాయం మరువలేనిది
- విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ
- ఉత్సాహంగా సాగిన 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే'



పదో వార్డులో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ



16వ వార్డు సభలో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ



తొమ్మిదో వార్డు సభలో మహిళలు

ఆరిలోవ: ఆపద సమయంలో ఆదుకునే ఆపద్బాంధవుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ కొనియాడారు. జీవీఎంసీ 9, 10 వార్డుల్లో గురువారం ×ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే౽కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఆయా వార్డుల్లో జరిగిన కార్యక్రమాల్లో విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు. 9వ వార్డులో కార్పొరేటర్ స్వాతి, పదో వార్డులో మాజీ కార్పొరేటర్ జగ్గుపిల్లి అప్పలరాజుతో కలసి పార్టీ జెండాలు, సంక్షేమ పథకాలు గురించి వివరించిన బోర్డులు ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభల్లో ఎంపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు వివరించారు. ఎక్కడ ఎలాంటి ఆపద వచ్చినా వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందిస్తున్నారన్నారు. నాలుగు రోజుల క్రితం నగరంలో మత్స్యకారుల బోట్లు అగ్నికి ఆహుతి కాగా వెంటనే ముఖ్యమంత్రి స్పందించి, ఎవరూ ఊహించనంతగా నష్టపరిహారం అందించారన్నారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చారన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేసి పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలను ఆదుకున్నారన్నారు. ప్రతి ఇంటికి ఏదో ఒక సంక్షేమ పథకం ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. అలాంటి సేవలు అందిస్తున్న సీఎం కనుకే ప్రజలు మళ్లీ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ 9, 10వ వార్డుల నాయకులు, కార్యకర్తలు, సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

16వ వార్డులో...

మద్దిలపాలెం : నాలుగున్నరేళ్ల పాలనలో రాష్ట్రంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల కారణంగా రాష్ట్రానికి మళ్లీ సీఎం జగన్ కావాలని ప్రజలు మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నారని ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. జీవీఎంసీ 16వ వార్డు కేఆర్‌ఎం కాలనీ సచివాలయం పరిధిలో గురువారం స్థానిక కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు ఆధ్వర్యంలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంవీవీ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇసుకతోట ప్రాంతంలో కోట్లాది రూపాయలు వెచ్చించి, రోడ్లు, గెడ్లు ఆధునికీకరణ పనులు చేపట్టామన్నారు. ఇసుకతోటలో పలు ప్రాంతాలలో సోలార్ లైట్లు ఏర్పాటు చేశామన్నారు. కార్పొరేటర్ మొల్లి లక్ష్మి మాట్లాడుతూ సచివాలయంలో చేపట్టిన అభివృద్ధి పనులు వివరించారు. ఇచ్చిన హామీలను మలు చేసిన గొప్ప నాయకుడు సీఎం జగన్ అని కొనియాడారు.

సృజనశీల సాహిత్యంతో యార్లగడ్డకు పురస్కారాలు



ప్రసంగిస్తున్న ఆచార్య బాలమోహన్ దాస్

ఏయూ క్యాంపస్: సృజనశీల సాహిత్యం ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌కు పురస్కారాలు అందించిందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఆచార్య వి.బాలమోహన్‌దాస్ అన్నారు. ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ 70వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఏయూ తెలుగు విభాగంలో నిర్వహించిన సాహిత్య సమాలోచన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ సమాజంపై అవగాహనతో పాటు భాష పట్ల ఉన్న నిబద్ధత ఎంతో విశిష్టమైనదన్నారు. యార్లగడ్డ రచించిన వివిధ నవలలు విశ్లేషణ చేస్తూ సమాజంలో పాత్రలను సృజించే విధంగా నవలల్లో అంశాలను వివరించారు. తెలుగు విభాగ విశ్రాంత ఆచార్యులు వెలమల సిమ్మన్న.. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్–సమకాలీనత అంశంపై ప్రసంగించారు. డాక్టర్ వి.మధుసూదనరావు ఆచార్య లక్ష్మీప్రసాద్ నవలలు–విశ్లేషణ అంశంపై, డాక్టర్ కల్లేపల్లి ఉదయ్ కిరణ్ పత్ర సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి ఆచార్య జర్ర అప్పారావు, ఆచార్య జి.యోహాన్‌బాబు, ఆచార్య బూసి వెంకటస్వామి, విభాగ ఆచార్యులు, పరిశోధకులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయిబాబా జయంతి



ప్రత్యేక అలంకరణలో శ్రీసత్యసాయిబాబా

ఎంవీపీ కాలనీ: భగవాన్ శ్రీసత్యసాయిబాబా జయంతిని ఎంవీపీ కాలనీలోని సాయి ప్రేమ సదన్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. గత కొద్ది రోజులుగా శ్రీసత్యసాయి సేవా సంస్థలు, శ్రీసత్యసాయి సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో పలు సేవా, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఉదయం నుంచి ఓంకారం, సుప్రభాతం నిర్వహించారు. బర్త్ డే ప్రత్యేక కేక్‌ను చిన్నారులు కట్ చేశారు. భక్తులు, విద్యార్థులు విశ్వశాంతి, విశ్వమానవ కల్యాణానికి ప్రత్యేక భజనలు నిర్వహించారు. స్వామికి ఉయ్యాల సేవ, మహా మంగళహారతి కార్యక్రమాలు జరిపారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో భక్తులు.. రోగులు, యాచకులు, ఖైదీలకు దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నసమారాధనతో పాటు ప్రసాద పంపిణీ చేపట్టారు. శ్రీసత్యసాయి విద్యావిహార్ ప్రిన్సిపాల్ అయ్యగారి కౌసల్య ఆధ్వర్యంలో విశ్వమానవ కల్యాణం, విశ్వ శాంతి కోసం సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు పీఆర్ఎస్ఎన్ నాయుడు, సిటీ కన్వీనర్ డీవీవీ సీతారామరాజు పాల్గొన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలి

మద్దిలపాలెం : ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలని ఏపీ స్టేట్ కాంగ్రెస్ ఓబీసీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ మూలా వెంకటరావు ఒక ప్రకటనలో కోరారు. 2018లో ఇచ్చిన నోటిఫికేషన్‌లో 7 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశారన్నారు. అప్పటి నుంచి డీఎస్సీ నోటిఫికేషన్ కోసం నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. మెగా డీఎస్సీ నిర్వహించాలన్నారు.

వైఎస్సార్ టీఎఫ్ గౌరవ సలహాదారుడిగా త్రినాథరావు

విశాఖ విద్య: వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ సలహాదారుడిగా అల్లూరి జిల్లా అరుకు ఎంఈవో-1 వంతల త్రినాథరావు నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి. అశోక్ రెడ్డి, కార్యదర్శి సుధీర్ నియామకాన్ని ప్రకటించారు. గెజిటెడ్ అధికారి హోదా గల వంతల త్రినాథరావు సేవలను సంఘం అభివృద్ధికి ఉపయోగించుకుంటామని వైఎస్సార్ టీఎఫ్ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షులు చొక్కాకుల సూర్యనారాయణ తెలిపారు.